GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA



ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 61 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 4 + https:www.prajarepublic.com + వెల - 1/-
శుక్రవారం 04 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## రూ.5వేల కోట్ల డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు.. కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు చేసిన అమిత్

### వేలాది కోట్ల రూపాయల డ్రగ్స్ పట్టుబడిన నేపథ్యంలో అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు.



దిల్లీ, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): దిల్లీలో వేలాది కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టయిన సంగతి తెలిసిందే. ఈ రాకెట్లో తుషార్ గోయల్ పేరు ప్రముఖంగా వినిపించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పై భాజపా అగ్రనేత అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ డ్రగ్స్ వ్యవహారంలో హస్తం పార్టీ నేత ప్రమేయం ఉండటం సిగ్గుచేటని తీవ్రంగా మండిపడ్డారు. "ఒకపక్క 'డ్రగ్స్ ఫ్రీ ఇండియా' కోసం మోదీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఉత్తర భారత్లో పట్టుబడిన డ్రగ్స్ కాంగ్రెస్ నేత ప్రమేయం ఉండటం సిగ్గుచేటు. ప్రమాదకరం. కాంగ్రెస్ పాలనలో పంజాబ్, హరియాణా, మొత్తం ఉత్తర భారతంలోని యువత ఈ మాదకద్రవ్యాల వల్ల ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారో చూశాం. ఒకవైపు మోదీ.. యువతను క్రీడలు, ఆవిష్కరణలు, విద్యవైపు ప్రోత్సహిస్తుంటే, వారిని కాంగ్రెస్ డ్రగ్స్ ప్రపంచం వైపు మళ్లించాలని అనుకుంటోంది. డ్రగ్ డీలర్ల రాజకీయ పలుకుబడితో సంబంధం లేకుండా ఆ నెట్వర్క్ ఎక్కడున్నా మోదీ ప్రభుత్వం పెకిలించి వేస్తుంది" అని ఎక్స్ వేదికగా అమిత్ షా స్పందించారు. మరోపక్క కాంగ్రెస్ మాత్రం అతడితో తమకు ఎలాంటి సంబంధం లేదని, రెండేళ్ల క్రితమే పార్టీ నుంచి బహిష్కరించామని భాజపా ఆరోపణలను తోసిపుచ్చింది.

## సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాం :సీఎం చంద్రబాబు


### తిరుమల లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.



అమరావతి, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): తిరుమల లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్లో ఆయన పోస్ట్ చేశారు. "తిరుమల లడ్డూ కల్తీ ఘటనపై సీబీఐ, ఏపీ పోలీస్, ఎఫ్ఎస్ఎస్ఏఐ సభ్యులతో సిట్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. 'సత్యమేవ జయతే', 'ఓం నమో వేంకటేశాయ" అని సీఎం పేర్కొన్నారు.

## సచివాలయం నుంచి దూకిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు.. మహారాష్ట్రలో ఉద్రిక్తత

- మహారాష్ట్ర సచివాలయ భవనం పైనుంచి ఎన్సీపీ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ నరహరి ఝిర్వాల్ దూకారు.



ముంబయి, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): మహారాష్ట్ర సచివాలయంలో శుక్రవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆదివాసీల రిజర్వేషన్లపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సొంత వర్గం ఎమ్మెల్యేలే ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ సహా కొందరు ఎమ్మెల్యేలు, ఓ ఎంపీ సచివాలయం మూడో అంతస్తు నుంచి దూకారు. అయితే, అక్కడ సేఫ్టీ నెట్ ఉండటంతో వీరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ పరిణామాలతో కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ధన్గఢ్ కమ్యూనిటీని ఎస్టీ కేటగిరీలో చేర్చాలన్న డిమాండ్ను మహారాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ వర్గానికి చెందిన ఎన్సీపీ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ నరహరి ఝిర్వాల్ తో పాటు భాజపా ఎంపీ హేమంత్ సావ్రా, ఎమ్మెల్యేలు కిరణ్ లహమాటే, హిరామన్ బోస్కర్, రాజేష్ పాటిల్ నిరసన చేపట్టారు. సచివాలయంలోని మూడో అంతస్తు నుంచి కిందకు దూకారు. మొదటి అంతస్తు వద్ద ఏర్పాటు చేసిన సేఫ్టీ నెట్లో పడ్డారు. పోలీసులు వెంటనే వారిని రక్షించారు. వీరికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. అనంతరం వారంతా సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన కొనసాగించారు. ధన్గఢ్ కమ్యూనిటీ సభ్యుల అభివృద్ధికి ప్రభుత్వం వివిధ పథకాలను ప్రకటించడంలో తమకు ఎలాంటి సమస్యలు లేవని.. అయితే వారిని ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఝిర్వాల్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు మంత్రాలయం (సచివాలయం) వద్దే ధర్నా కొనసాగిసామన్నారు. అయితే మహారాష్ట్ర సీఎం ఏక్నాథ్ శిందే వారితో సమావేశమై ఎమ్మెల్యేల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఈ సచివాలయం పైనుంచి కొందరు దూకేందుకు ప్రయత్నించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా 2018 ఫిబ్రవరిలో సచివాలయం మొదటి అంతస్తు వద్ద భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు.

## దిల్లీ డ్రగ్స్ కేసుకు దుబాయ్లో మూలాలు..!



దిల్లీ, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): దిల్లీలో పట్టుబడిన రూ.2,000 కోట్ల విలువైన కొకైన్ వెనక అంతర్జాతీయ స్మగ్లర్ల హస్తం ఉన్నట్లు గుర్తించారు. దుబాయ్స్ ఉంటున్న భారతీయుడు వీరేంద్ర బసోయా దీనికి మాస్టర్మైండ్గా గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో ఐదో నిందితుడు జితేంద్ర పాల్ సింగ్ అలియాస్ జెస్సీ గురువారం యూకేకు పారిపోయేందుకు యత్నిస్తుండగా అమృత్సర్లో అరెస్టు చేశారు. ఈ ముఠాకు దేశవ్యాప్తంగా సంబంధాలున్నట్లు అధికారులు భావిస్తున్నారు. వాస్తవానికి జెస్సీ గత 17 ఏళ్లుగా యూకేలోనే ఉంటున్నాడు. కానీ, అతడు భారత్ లో మత్తు పదార్థాల వ్యాపారం పర్యవేక్షణ నిమిత్తం పంజాబ్కు చేరుకొన్నాడు. ఢిల్లీలో అరెస్టుల నేపథ్యంలో అప్రమత్తమై తిరిగి యూకే వెళ్లేందుకు యత్నిస్తుండగా అరెస్టు చేశారు. ఇటీవల పట్టుబడిన నిందితులను విచారించగా.. వారు దుబాయ్ లోని వీరేంద్ర పేరును చెప్పారు. గతేడాది పుణెలో స్వాధీనం చేసుకొన్న రూ.3,000 కోట్ల మ్యావ్-మ్యావ్ వెనుక కూడా ఇతడి హస్తం ఉన్నట్లు గుర్తించారు. నాడు పోలీసులు దిల్లీ వద్ద పిలాంజిలోని ఇతడి ఇంటిపై దాడి చేశారు. అప్పట్లో తప్పించుకొన్నాడు. వీరేంద్ర కుమారుడిని యూపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే కుమార్తెకిచ్చి గతేడాది వివాహం చేశాడు. గతంలో ఇతడిని పోలీసులు ఓ డ్రగ్ కేసులో అరెస్టు చేసినా.. బెయిల్పై వెంటనే బయటకు వచ్చాడు. ఆ తర్వాత దుబాయ్కు మకాం మార్చి అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్తో కలిసి కార్యకలాపాలు నిర్వహించాడు. ఈ క్రమంలో తుషార్ గోయల్ తో కలిసి మత్తు పదార్థాల వ్యాపారాలు చేశారు. దుబాయ్ నుంచి వచ్చే ప్రతీ కొకైన్ కన్సైన్మెంట్కు రూ.3 కోట్లు ఇస్తానని అతడితో ఒప్పందం చేసుకొన్నాడు.

## ఎన్ని ఆటంకాలు ఎదురైనా మూసీ ప్రక్షాళన పూర్తి చేస్తాం :మంత్రి కోమటిరెడ్డి

### ఎన్ని ఆటంకాలు ఎదురైనా మూసీ ప్రక్షాళన పూర్తి చేస్తామని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.



హైదరాబాద్, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): ఎన్ని ఆటంకాలు ఎదురైనా మూసీ ప్రక్షాళన పూర్తి చేస్తామని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హైదరాబాద్లోని నోవాటెల్ లో అసోచామ్ ఆధ్వర్యంలో అర్బన్ ఇన్ఫ్రాస్టక్చర్ సమిట్ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. మూసీని సుందరీకరించి ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్ను తీర్చిదిద్దుతామన్నారు. మూసీకంటే ప్రమాదకరమైన సబర్మతిని మంచినీటి సంస్సుగా మార్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ మహానగర జనాభా కోటిన్నర దాటిందని, నగరంలో నాలుగు మేయర్ స్థానాలు ఏర్పాటు చేసే అంశం పరిశీలనలో ఉందని తెలిపారు. అమెరికా తర్వాత అధిక బహుళజాతి కంపెనీలు హైదరాబాద్లోనే ఉన్నాయన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని, రెండు నెలల్లో టెండర్లు పిలుస్తామని మంత్రి తెలిపారు.

## విజయ్ పాల్ పిటిషన్.. దర్యాప్తునకు సహకరించాల్సిందేనని సుప్రీం ఆదేశం

దిల్లీ, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): మాజీ పోలీసు అధికారి విజయ్పాల్ పిటిషన్పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ వ్యవహారంలో విజయ్పాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈక్రమంలో ప్రతివాదులకు జస్టిస్ విక్రమ్నాథ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణ వరకు విజయ్పాల్పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం ఆదేశించింది. దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాల్సిందేనని చెప్పింది. విజయ్పాల్ తరఫున సీనియర్ లాయర్లు అభిషేక్ మను సింఘ్వీ, సిద్ధార్థ దవే హాజరుతో ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇద్దరు సీనియర్లు సరిపోతారా అని వ్యాఖ్యానించింది. వైకాపా హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో విజయ్పాల్ నిందితుడిగా ఉన్నారు.



## సీఎం నివాసాన్ని ఖాళీ చేసిన అరవింద్ కేజ్రీవాల్

### ఆప్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సీఎం నివాసాన్ని ఖాళీ చేశారు.



దిల్లీ, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): ఆప్ అధినేత, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సీఎం నివాసాన్ని ఖాళీ చేశారు. సివిల్ లైన్స్ ఏరియాలో 6 ఫ్లాగ్జాఫ్ రోడ్లోని ఆ ఇంటి నుంచి శుక్రవారం తన కుటుంబంతో కలిసి బయటకు వచ్చారు. ఇటీవల ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆప్ పార్టీ కేంద్ర కార్యాలయం సమీపంలోని బంగ్లాలో ఇకపై నివాసం ఉండనున్నారు. పంజాబ్కు చెందిన ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిత్తల్కు అధికారికంగా కేటాయించిన ఆ భవనం.. ఫిరోజా రోడ్డులో ఉంది. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని, జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలై వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దాంతో ఆతిశీ నూతన సీఎంగా బాధ్యతలు చేపట్టారు. దాంతో సీఎం నివాసాన్ని ఖాళీ చేయనున్నట్టు ఇటీవల పార్టీ కార్యకర్తలకు కేజ్రీవాల్ వెల్లడించారు. తమ ఇంటికి రావాలని, తమతో ఉండిపోవాలని పలువురు చట్ట సభ్యులు, కార్యకర్తలు ఆయన్ను కోరారు. 2013లో తొలిసారిగా సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఆయన తిలక్ లేన్లో ఉండేవారు. 2015లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఫ్లాగ్జాఫ్ రోడ్డులోని ఇంటికి మారారు.

## హైడ్రాపై కేఏ పాల్ పిటిషన్.. ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): హైడ్రా కూల్చివేతలపై హైకోర్టులో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్పై విచారణ జరిగింది. జీవో 99పై స్టే విధించాలని.. కూల్చివేతలను తక్షణమే ఆపేయాలని కేఏ పాల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇప్పటికప్పుడు కూల్చివేతలు ఆపలేమని ఉన్నత న్యాయస్థానం తెలిపింది. హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలని.. అక్రమ కట్టడాల కూల్చివేతలకు నెలరోజుల ముందే నోటీసులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. అనంతరం ప్రతివాదులుగా ఉన్న హైడ్రా, రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 14కి వాయిదా వేసింది.

## అన్నపూర్ణగా వరంగల్ భద్రకాళీ అమ్మవారు.. భారీగా భక్తుల రద్దీ

- ఓరుగల్లు వాసుల ఇలవేల్పు భద్రకాళీ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి.

వరంగల్, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): ఓరుగల్లు వాసుల ఇలవేల్పు భద్రకాళీ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అన్నపూర్ణగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. దర్శించుకునేందుకు భక్తులు ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లలో బారులు తీరారు. భద్రకాళీ నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. పెరిగిన రద్దీతో ఆలయం కిక్కిరిసిపోయింది.






printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వివాదం..

## స్వతంత్ర సిట్ ఏర్పాటుకు సుప్రీం ఆదేశం

**తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణల అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.**



దిల్లీ, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణల అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్లతో కూడిన ధర్మాసనం దీనిని విచారించింది. ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిలో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం తరఫున ఇద్దరు పోలీసు అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒక సీనియర్ అధికారి సభ్యులుగా ఉండాలని సూచించింది. స్వతంత్ర సిట్ దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని తెలిపింది. కోట్లాది భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. కోర్టులను రాజకీయ వేదికలుగా వినియోగించవద్దని వ్యాఖ్యానించింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన అభిప్రాయాన్ని సుప్రీంకోర్టుకు తెలిపారు. "మొత్తం అంశాన్ని పరిశీలించాను. సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవు. వచ్చిన ఆరోపణల్లో నిజం ఉంటే ఆమోదయోగ్యం కాదు. తిరుమల శ్రీవారికి దేశవ్యాప్తంగా భక్తులున్నారు. సీనియర్ కేంద్ర అధికారి పర్యవేక్షణ ఉంటే మరింత విశ్వాసం పెరుగుతుంది" అని చెప్పారు. అనంతరం స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కోట్లమంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ వివాదంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరిపించాలని కోరుతూ.. మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి, వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, విక్రమ్సంపత్ అనే భక్తుడు, సుదర్శన్ టీవీ ఎడిటర్ సురేష్ ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్నే (సిట్) కొనసాగించాలా? లేదంటే ప్రత్యేక స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలా అన్న అంశంపై కేంద్రం తరఫున అభిప్రాయం చెప్పాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. అనంతరం విచారణను గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు వాయిదా వేసింది. ఆ ప్రకారం 3.30కి ధర్మాసనం ముందు హాజరైన తుషార్ మెహతా.. తాను నాలుగో కోర్టులో మరో కేసు విచారణలో ఉన్నందున ఈ కేసు విచారణను శుక్రవారం ఉదయం 10.30కి తీసుకోవాలని ధర్మాసనానికి విన్నవించారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ బీఆర్ గవాయి.. కల్తీ నెయ్యి వివాదం కేసును శుక్రవారం మొదటి నంబర్ కింద విచారించడానికి అంగీకరిస్తూ వాయిదా వేశారు.

## వంద శాతం రుణమాఫీ పూర్తి చేశామని చెప్పినవన్నీ డొల్ల మాటలే :కేటీఆర్

**20 లక్షల మందికి రుణమాఫీ కాలేదన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటనతో సీఎం బండారం మరోసారి బయటపడిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.**



హైదరాబాద్, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): 20 లక్షల మందికి రుణమాఫీ కాలేదన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటనతో సీఎం బండారం మరోసారి బయటపడిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. వంద శాతం రుణమాఫీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి మాటలన్నీ డొల్లమాటలేనని ఇంకోసారి తేలిపోయిందన్నారు. ఓ వైపు డిసెంబర్ 9న ఏక కాలంలో చేస్తామని దగాచేసి.. మరోవైపు 10 నెలలైనా 20 లక్షల మందికి అందించకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. 2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న మాటలు నయవంచన కాక మరేంటని ప్రశ్నించారు. అధికారిక లెక్కల ప్రకారమే.. 20 లక్షల మంది అన్నదాతలకు అన్యాయం జరిగితే... అనధికారికంగా ఎంతమంది రైతులున్నారో అని ఆందోళన వ్యక్తంచేశారు. చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదని.. ఇవ్వాల్సిన రైతుబంధు సీజన్ ముగిసినా ఇవ్వలేదంటూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

# దేవి శరన్నవరాత్రులలో రెండవ నవదుర్గగా బ్రహ్మ చారిణి అవతారం

**నేడు ఇంద్రకీలాద్రిపై గాయత్రి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనం**




విజయవాడ, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): దుర్గాదేవి తొమ్మిది అవతారాల్లో రెండు వ రోజు బ్రహ్మ చారిణిఅవతారం, భక్తులు ఈ అమ్మవారిని బ్రహ్మ చారిణి ...( గాయత్రి దేవి ) అని కూడా పిలుస్తారు, నవరాత్రులలో పూజించే నవదుర్గల్లో రెండవ అవతారమైన బ్రహ్మ చారిణి ...!! ధైర్యానికీ, శక్తికీ, తేజస్సుకూ ప్రతీకగా భక్తులు భావిస్తారు. ఆమె తన తేజస్సుతో పూజించినవారి పాపాలు, ఈతిబాధలు, రోగాలు, మానసిక రుగ్మతలు, భూత భయాలు దూరం చేస్తుంది.జపమాల, ఘంట, బాణం, పదునైన ఖడ్గం, శ్వేత పద్మం, పానపాత్ర, త్రిశూలం, ధనుస్సు, కమలం, గద ధరించి మహాలావణ్య శోభతో ప్రకాశిస్తుంది, ఈ మాత కృపవలన సాధకుని సమస్త పాపాలూ, బాధలూ తొలగిపోతాయి. ఈమె ఆరాధన సద్యః ఫలదాయకము. ఈమె నిరంతరమూ యుద్ధసన్నద్ధురాలై ఉన్నట్లు దర్శనమిస్తుంది కనుక భక్తుల కష్టాలను అతి శీఘ్రముగా నివారిస్తుంది,ఈ సింహవాహనను ఉపాసించేవారు సింహసదృశులై పరాక్రమశాలురుగా నిర్భయులుగా ఉంటారు. ఈమె ఘంటానాదము సంతతము భక్తులను భూతప్రేతాది బాధలనుండి కాపాడుతూ ఉంటుంది, ఈ దేవీ స్వరూపము దుష్టులను అణచివేయటంలో, హతమార్చుటంలో అనుక్షణమూ సన్నద్ధురాలై ఉండునదేబీ అయినప్పటికీ భక్తులకూ, ఉపాసకులకూ ఈమె స్వరూపము మిక్కిలి సౌమ్యముగానూ ప్రశాంతముగానూ కనబడుతూ ఉంటుంది, ఈమెను ఆరాధించడంవల్ల సాధకులలో వీరత్వ నిర్భయత్వములతోపాటు సౌమ్యతా, వినమ్రతలు పెంపొందుతుంటాయి. వారి నేత్రాలలోని కాంతులు, ముఖవర్చస్సు, శరీర శోభలు ఇనుమడిస్తూ, సద్గుణములు వృద్ధిచెందుతుంటాయి, వారి కంఠస్వరములలో అలౌకికమైన దివ్యమాధుర్యము రాశిగా ఏర్పడుతుంది, బ్రహ్మ చారిణి ..దుర్గా దేవి ఎనిమిది చేతులతో ఉంటుంది. ఒక చేతిలో త్రిశూలం, ఒక దానిలో గద, ఒక చేతిలో ధనుర్బాణాలు, మరో చేతిలో ఖడ్గం,హాకింకోహాచేతిలో కమండలంహాటింటాయి. కుడి హస్తంహాటూత్రం అభయముద్రతో ఉంటుంది. బ్రహ్మ చారిణి దుర్గాదేవి పులి మీదగానీ, సింహం మీదగానీ ఎక్కుతుంది. ఈ వాహనాలు ధైర్యానికి, సాహసానికీ ప్రతీకలు.హాఅిమ్మవారి కిరీటంలో ఉండగా, ఫాలభాగంలో మూడో నేత్రంతో ప్రకాశిస్తుంది ఆ తల్లి, అమ్మవారు బంగారు వర్ణంలో మెరిసిపోతూంటుంది.

శివుడు ఈ అమ్మవారి అందానికి ముగ్ధుడయ్యాడని పురాణోక్తి, పులి లేదా సింహవాహిని అయిన అమ్మవారు ధైర్య ప్రదాయిని. నిజానికి ఈ రూపం కొంచెం ఉగ్రమయినా, ఆమె ఎల్లప్పుడూ ప్రశాంత వదనంతోనే ఉంటుంది. ఉగ్రరూపంలో ఉండే ఈ అమ్మవారిని చండి, చాముండాదేవి అని పిలుస్తారు ఈ అమ్మవారిని ఉపాసించేవారు మొహంలో దైవ శోభతో ప్రకాశిస్తుంటారని భక్తుల నమ్మిక. వారు అద్భుతమైన తేజస్సుతో ఉంటారట. ఈ అమ్మవారిని పూజించేవారు విజయాన్ని అతిశీఘ్రంగా పొందగలరని భక్తుల విశ్వాశం. దుష్టులను శిక్షించేందుకు ఈ అమ్మవారు ఎప్పుడూ తయారుగా ఉంటుందని పురాణోక్తి. అలాగే తన భక్తులకు ప్రశాంతత, జ్ఞానం, ధైర్యం ప్రసాదిస్తుందిట ఈ అమ్మవారు. రాక్షసులతో యుద్ధం చేసే సమయంలో అమ్మవారి చేతిలోని ఘంట భీకరమైన శబ్దం చేసిందట. కొందరు రాక్షసులకు ఆ ఘంటానినాదానికే గుండెలవిసాయని దేవి పురాణం చెబుతోంది. అయితే ఈ ఘంటానినాదం ఆమె భక్తులకు మాత్రం శుభదాయకమనీ, ఎంతో మధురంగా వినపడుతుందని ప్రతీతి. దుష్టులకు అమ్మవారి రూపం ఎంత భయదాయకమో, ఉపాసకులకు మాత్రం అంత ప్రశాంతంగా కనిపిస్తుంది. పురాణ చరిత్ర శివుడు, పార్వతి దేవిని వివాహం చేసుకోవడానికి ఒప్పుకున్నహాతరువాత ఆమె ఎంతో సంతోషిస్తుంది. పార్వతీదేవి తల్లిదండ్రులైనహా మేనకా దేవి, హిమవంతులు కూడా పెళ్ళికి అంగీకరిస్తారు. పెళ్ళి రోజున శివుడు దేవతలతోనూ, మునులతోనూ, తన గణాలతోనూ, శ్మశానంలో తనతో ఉండే భూత, ప్రేత, పిశాచాలతోనూ తరలి విడిదికిహావస్తాడు. వారందరినీ చూసి పార్వతి తల్లి మేనకాదేవి కళ్ళు తిరిగి పడిపోతుంది.హా అప్పుడుహాఅమ్మవారుహాచంద్రఘంటాదేవిహారూపంలో శివునకు కనిపించి, తమ కుటుంబం భయపడకుండా ఉండేలా తన వేషం మార్చుకోమని ఆయనను కోరుతుంది. అప్పుడు శివుడు రాజకుమారుని వేషంలో, లెక్కలేనన్ని నగలతో తయారవుతాడు. అప్పుడు ఆమె కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులూ భయం పోయిహాశివుణ్ణి వివాహానికి ఆహ్వానిస్తారు. ఆ తరువాత శివ, పార్వతులు వివాహం చేసుకుంటారు. అలా ప్రజల భయాన్ని పోగొట్టేందుకు అమ్మవారు మొదటిసారి ఇలా చంద్రఘంటా అవతారం ఎత్తింది. శివ, పార్వతుల కుమార్తె కౌషికిగా దుర్గాదేవి జన్మించింది. శుంభ, నిశుంభులను సంహరించమని ఆమెను దేవతలు ప్రార్థించారు. ఆమె యుద్ధం చేస్తుండగా, ఆమె అందం చూసి రాక్షసులు మోహితులవుతారు. అమెను తన తమ్ముడు నిశుంభునికిచ్చి వివాహం చేయాలని శుంభుడు కోరుకుని ధూమ్రలోచనుణ్ణి కౌషికిని ఎత్తుకురమ్మని పంపిస్తారు. అప్పుడు అమ్మవారు తిరిగి చంద్రఘంటా దుర్గా అవతారం ధరించి ధూమ్రలోచనుణ్ణి, అతని పరివారాన్ని సంహరిస్తుంది.అలా శుంభ, నిశుంభులతో యుద్ధంలో నవదుర్గా అవతారాల సమయంలో రెండోసారి ఆమెను తన తమ్ముడు నిశుంభునికిచ్చి వివాహం చేయాలని శుంభుడు కోరుకుని ధూమ్రలోచనుణ్ణి కౌషికిని ఎత్తుకురమ్మని పంపిస్తారు. అప్పుడు అమ్మవారు తిరిగి చంద్రఘంటా దుర్గా అవతారం ధరించి ధూమ్రలోచనుణ్ణి, అతని పరివారాన్ని సంహరిస్తుంది. అలా శుంభ, నిశుంభులతో యుద్ధంలో నవదుర్గా అవతారాల సమయంలో రెండోసారి బ్రహ్మ చారిణిగా దుర్గా అవతారంగా విశ్వసించి కొలుస్తారు.

## తాగునీటి ప్లాంట్ నిర్మాణానికి పురందేశ్వరి కుమారుడు రూ.కోటి విరాళం

**బాపట్ల జిల్లా కారంచేడులో రూ.75 లక్షలతో నిర్మించిన శుద్ధ జలకేంద్రాన్ని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు.**




అమరావతి, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా కారంచేడులో రూ.75 లక్షలతో నిర్మించిన శుద్ధ జలకేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, పరుచూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రి డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కారంచేడులోని జయప్రకాష్ నారాయణ చెరువు వద్ద రూ.కోటి నిధులతో నిర్మించనున్న మరో ఆర్వో ప్లాంట్కు కూడా శంకుస్థాపన చేశారు. శుద్ధ జల కేంద్రం నిర్మాణానికి దగ్గుబాటి పురందేశ్వరి కుమారుడు హితేష్ చెంచురామ్ రూ.కోటి చెక్కును మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ కారంచేడు గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు నిధులు సమకూర్చడం, మరో ఆర్వో ప్లాంటు నిర్మాణానికి దగ్గుబాటి కుటుంబం ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పురందేశ్వరి మాట్లాడుతూ... కారంచేడులో గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి దగ్గుబాటి కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని, ఈ శుద్ధ జలకేంద్రాన్ని గ్రామస్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాజధాని అమరావతి కోసం కొత్త రైల్వే లైన్: జీఎం అరుణ్ కుమార్

**గత ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో దక్షిణ మధ్య రైల్వే (ద.మ. రైల్వే) అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిందని జీఎం అరుణ్ కుమార్ జైన్ తెలిపారు.**

### పెండింగ్ ప్రాజెక్టులపై రైల్వే జీఎంతో చర్చించాం : తెదేపా ఎంపీలు

ఏపీలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్తో నిర్వహించిన సమావేశంలో చర్చించినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని, తెదేపా ఎంపీలు కేశినేని శివనాథ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పంచలింగాల నాగరాజు తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జిల పూర్తికి జీఎం సానుకూలంగా ఉన్నారని చెపారు. రైల్వే, రెవెన్యూ, విజయవాడ నగరపాలక సంస్థ అధికారులతో ఒక కమిటీ వేయాలని కోరామని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. నగరంలో డ్రైనేజీ శాశ్వత పరిష్కారానికి జాయింట్ కమిటీ ఏర్పాటుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. గత ప్రభుత్వ తప్పిదం వల్లే రైల్వేల్లో రాష్ట్రం వెనకబడిందని విమర్శించారు.




హైదరాబాద్, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): గత ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో దక్షిణ మధ్య రైల్వే (ద.మ. రైల్వే) అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిందని జీఎం అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. ద.మ.రైల్వే పరిధిలో ప్రస్తుతం రూ.21 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రగతిలో ఉన్నాయన్నారు. విజయవాడలోని రైల్వే ఈటీటీసీ కేంద్రంలో ఏపీలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్రమంత్రి పెమ్మసాని, తెదేపా ఎంపీలు కేశినేని శివనాథ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పంచలింగాల నాగరాజుతో అరుణ్కుమార్ సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "ఏపీకి సంబంధించి 73 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నాం. తిరుపతి, నెల్లూరు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. విజయవాడ రైల్వే స్టేషన్ న్ను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటివరకు 257 ఆరాయూబీలను తొలగించాం. రైళ్లు ఢీ కొట్టకుండా ఏపీలో నిర్ణీత కిలోమీటర్ల మేర కవచ్ను అమలు చేస్తున్నాం. గతేడాది 35 రైళ్లు ప్రవేశపెట్టగా, వాటిలో 6 వందేభారత్ రైళున్నాయి. 2024-25 రైల్వే బడ్జెట్లో ద.మ. రైల్వేకి రూ.9,154 కోట్లు మంజూరయ్యాయి. రాజధాని అమరావతి కోసం ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు - రైల్వే లైన్ సర్వే పూర్తైంది. రైల్వే బోర్డు ఆమోదం తెలిపి, నిధులు కేటాయించగానే కొత్త రైల్వే లైన్ పనులు ప్రారంభిస్తాం. ఎంపీలతో సానుకూల వాతావరణంలో సమావేశం జరిగింది. వారు ఇచ్చిన ప్రతిపాదనలను రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్తాం. విజయవాడలో డ్రైనేజీ నీరు వెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో కమిటీ నియమించాం. మచిలీపట్నం - బాపట్ల - రేపల్లె రైల్వే లైన్ కోసం ఎంపీలు ప్రతిపాదనలు ఇచ్చారు. విజయవాడ ప్రధాన స్టేసన్కు అనుబంధంగా శాటిలైట్ స్టేషన్లను అభివృద్ధి చేస్తాం. వాటిలో ప్రధానంగా గుణదల, రాయనపాడు స్టేషన్లను శాటిలైట్ స్టేషన్లుగా అభివృద్ధి చేస్తున్నాం" అని జీఎం తెలిపారు.




## విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై త్వరలో సీఎంను కలుస్తాం :వైఎస్ షర్మిల

**స్టీల్ ప్లాంట్ పై భాజపా చేస్తున్నవి చిల్లర రాజకీయాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు.**



విశాఖ, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): స్టీల్ ప్లాంట్ పై భాజపా చేస్తున్నవి చిల్లర రాజకీయాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణపై విజయవాడలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై త్వరలో అఖిలపక్షంతో సీఎంను కలుస్తామన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ అంశంపై స్పెషల్ సిట్ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

## బాలికలపై అత్యాచార ఘటన తీవ్రంగా కలచివేసింది: హరీశ్ రావు

**రాష్ట్రంలో మహిళలకు భద్రత కరవైందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు.**

హైదరాబాద్, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రంలో మహిళలకు భద్రత కరవైందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇద్దరు మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార ఘటన వార్త తనను తీవ్రంగా కలచివేసిందని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని సాక్షాత్తూ అసెంబ్లీ వేదికగా ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడలేదని దుయ్యబట్టారు. ఫలితంగా ప్రతిరోజు ఎక్కడో ఒకచోట అత్యాచార ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయని పేర్కొన్నారు. "9 నెలల కాంగ్రెస్ పాలనలో 2 వేలకు పైగా అత్యాచారాలు జరిగాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హోం మంత్రిత్వ శాఖను కూడా తానే నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో సీఎం రేవంత్రెడ్డి పూర్తిగా విఫలమయ్యారు. గత ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. షీ టీమ్స్, సఖి భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసింది. కానీ, ప్రస్తుతం ఇందిరమ్మ రాజ్యం అని ఊదరగొట్టడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలో మహిళలకు భద్రత లేదని తేటతెల్లమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి. మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడిన దుర్మార్గులకు కఠినశిక్షలు పడేలా చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అని హరీశ్రావు తెలిపారు.



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
నంద్యాల
శుక్రవారం 04 అక్టోబర్ 2024 | https:www.prajarepublic.com | 3

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి


## ■ నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎన్.ఎం.డి ఫిరోజ్

నంద్యాల, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో అక్టోబర్ 8 వ తేదీ స్థానిక బొమ్మల సత్రం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి , ప్లేస్మెంట్ ఆఫీసర్ సుబ్బన్న , స్కిన్ హబ్ కోఆర్డినేటర్ మస్తాన్ వలి , 36వ వార్డు టిడిపి ఇన్చార్జ్ మారుతి తో కలిసి నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పోస్టర్లను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ, చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 4 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొనబోతున్నాయని . దాదాపు 338 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయ-మన్నారు. ఈ ఆశయానికి అనుగుణంగా మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు అలాగే నాకు తెలిసిన హైదరాబాద్ కంపెనీస్ కూడా నంద్యాలకు తీసుకుని వచ్చి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# శ్రీ బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో ఉమాదేవి అమ్మవారు



శ్రీ బాల త్రిపుర సుందరి దేవిగా ఉమాదేవి అమ్మవారు

బండి ఆత్మకూరు, అక్టోబర్ 4, (రిపబ్లిక్ న్యూస్): నల్లమల అటవీ ప్రాంతంలోని అతి పురాతన శైవ క్షేత్రం ఓంకార క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉమాదేవి అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తెల్లవారుజామునే అర్చకులు అమ్మవారిని శ్రీ బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరణ చేశారు.వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు కుంకుమార్చనలు చేశారు. పూజల అనంతరం భక్తులు శ్రీ కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి చేరుకొని అక్కడ స్వామి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకులు ఉచిత అన్నదాన ప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగప్రసాద్ వసతి సదుపాయాలు కల్పించారు.

# జిల్లాలో విజిబుల్ పోలీసింగ్, ఎన్ఫోర్స్మెంట్ పై ప్రత్యేక దృష్టి



నంద్యాల క్రైం, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్ పరిధిలలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీసు అధికారులు వారి సిబ్బంది సహాయంతో, క్యూర్.ఆర్.టీంలతో నాటు సారాయిపై విశ్రుత దాడులు నిర్వహించడం జరిగింది. ఈ దాడులలో 12 కేసులు నమోదుచేసి 143 లీటర్ల సారాయిని, 165 (180 ఎం ఎల్ ) అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. నంద్యాల జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ పరిధిలలో విజిబుల్ పోలిసింగ్ లో భాగంగా పోలీసు అదికారులు వారి సిబ్బంది సహాయంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టగా మొత్తం 14 కేసులు నమోదు కావడం జరిగింది. ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా భహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై 64 కేసులు నమోదు చేయడంతో పాటు బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయుచున్న వాపై చర్యలలో భాగంగా 60 కేసులు నమోదు చేసి 5490 రూపాయలను జరిమానా విధించడం జరిగింది. 01 మట్కా కేసు నమోదు చేసి 04 అరెస్ట్ చెయ్యడంతో పాటు 2200 రూపాయలను తదుపరి చర్య నిమిత్తం స్వాధీనం చేసుకోవడం జరిగింది. నంద్యాల జిల్లా డోన్ సబ్ డివిజన్ లోని డోన్ టౌన్, ప్యాపిలి సర్కిల్ పరిధిలోని గ్రామ శివారు ప్రాంతాలలో జూదం ఆడుచున్నారనే సమాచారం మేరకు పోలీసు అదికారులు వారి సిబ్బంది సహాయంతో దాడులు నిర్వహించి 02 కేసులు నమోదు చెయ్యడంతో పాటు 08 మందిని అరెస్ట్ చేసి 24250 రూపాయలను తదుపరి చర్య నిమిత్తం స్వా-ధీనం చేసుకోవడం జరిగింది. జిల్లాలో మోటార్ వెహికల్ చట్టం అమలుచేస్తు 331 కేసులు నమోదు చేసి 1,43,200 రూపాయలను జరిమాన విధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో విజిబుల్ పోలిసింగ్ లో భాగంగా పై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎవరైన చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడిన చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని వాహనదారులు ట్రాఫిక్ రోడ్డు భద్రత నిభందనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని తెలియజేశారు.



# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి-ఎం.ఎల్.ఎ

పాణ్యం, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, కార్యాలయానికి చేరుకొని బాధితుల నుంచి వ్యక్తిగత, సామూహికంగా, ఉన్న సమస్యలను దరఖాస్తుల రూపంలో తీసుకున్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

దరఖాస్తులను అధికారికంగా నమోదు చేసి ఎమ్మెల్యే ద్వారా వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల చేత కూడా పరిష్కార మార్గాలను బాధితులకు వివరించే విధంగా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గ కేంద్రంలో మొట్టమొదటిసారిగా ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు శ్రీకారం చుట్టామని ఇందుకోసం బాధితులు వ్యక్తిగతంగా, సామూహికంగా తమకు ఉన్న ఇబ్బందులను, సమస్యలను, అధికారుల దృష్టికి తీసుకుని వస్తే వారు సామరస్యంగా పరిష్కరించాలని తెలిపారు. ఇప్పుడు అందిన సమస్యలను వచ్చే పరిష్కార వేదిక సమయంలోపల పూర్తి చేయాలని, పాతవి పెండింగ్లో లేకుండా కొత్త సమస్యలను పరిష్కరించుకునే విధంగా అధికారులు స్వచ్ఛంగా ఉండాలని తెలిపారు. ప్రజా సమస్యలలో ముఖ్యంగా అర్హులైన వారికి పింఛన్లు, కావాలని ఇంటి స్థలాలు, పక్కా ఇల్లు కావాలని, పొలాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత


సమస్యలతో, దరఖాస్తులు వందలాదిగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నిక్షిప్తమయ్యాయి. కార్యక్రమంలో తాసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, సిఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, మండల టిడిపి కన్వీనర్ జయరామిరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ శివశంకర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల నుంచి వచ్చినటువంటి ప్రజలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# క్రీడాభారతి ఆధ్వర్యంలో ఫుట్ బాల్ శిక్షణ



నంద్యాల, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): 9 నుండి 15 సంవత్సరాల లోపు వయసుగల బాలురకు ఉచిత ఫుట్ బాల్ క్యాంపు శుక్రవారం బాలాజీ కాంప్లెక్స్ నందలి శాంతినికేతన్ స్కూల్ ఆవరణలో నిర్వహించడం జరిగినది. ఈ కోచింగ్ క్యాంప్ ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు సాయంకాలం 5 గంటల నుండి 7 గంటల వరకు జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రీడాభారతి రాయలసీమ జోనల్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి శాంతినికేతన్ స్కూల్ కరెస్పాండెంట్ , క్రీడాభారతి నంద్యాల అధ్యక్షులు సుధాకర్ , ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్ లు తెలిపారు. నంద్యాల జిల్లా లిఫుట్ బాల్ అసోసియేషన్, క్రీడాభారతి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఫుట్ బాల్ అసోసియేషన్ నిర్వాహకులు రాజా, కిరణ్, అఖిల్ లతోపాటు సుమారుగా 40 మంది విద్యార్థులు ఈ శిక్షణకు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణవాసులు అందరూ కూడా ఈ ఉచిత శిక్షణ శిబిరాన్నిఉపయోగించుకుని రాబోయే రోజులలో పిల్లలు గొప్ప స్థాయిలో రాణించడానికి ఈ శిక్షణ ఉపయోగపడాలని వారు ఆశ భావంవ్యక్తం చేశారు. క్రీడాభారతి జిల్లా అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ మె-ుబైల్స్ కి అడిక్ట్ కాకుండా ఈ ఆటలో మంచి ప్రావిణ్యాన్ని సంపాదించి రాబోయే రోజుల్లో ఫుట్బాల్ ఆటను. నంద్యాల నుండి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. క్రీడాభారతి నాలుగు నెలల క్రితం నంద్యాలలో పురుడు పోసుకుని ఫుట్ బాల్ ఆటతోనే మొదలు కావడం, అదే ఆటకు శిక్షణ అందించడం చాలా ఆనందంగా ఉందని దీనికి సహకరించిన ఫుట్ బాల్ అసోసియేషన్ నిర్వాహకులు అందరినీ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రీడా భారతి ట్రెజరర్ రమేష్ కమిటీ మెంబర్లు రమణ, గోపి పీఈటీలు, కోచ్లు పాల్గొన్నారు. ఆసక్తి కలవారు ఈ నెంబర్లకు సంప్రదించాలని 7981686132, 8340969885 కోరారు.

# కుక్కలు బాబోయ్ కుక్కలు



నంద్యాల, బొమ్మలసత్రం, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల పట్టణంలో కుక్కల సైర్వ్య వి హారం మున్సిపల్ అధికారులు నంద్యాల పట్టణ ప్రజలను పట్టించుకోండి దాదాపుగా 42 వార్డులలో విపరీతంగాకుక్కలు ఉన్నాయి. కుక్కలు ప్రజలపై దాడి చేస-్తున్న గాని మున్సిపల్ అధికారులు కానీ అధికారులు కానీ ఏ ఒక్కరు పట్టించుకోకపోవడం చాలా బాధాకరం కుక్కలు చిన్న పిల్లలపై పెద్దలపై ఎటునుంచి ఎక్కడ దాడి చేస్తాయో అని ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని తిరుగుతున్నారు. ఎందుకంటే వాహనాల వెంటపడి కూడా ప్రజలను త్రీవ ఇబ్బందులు గురి చేస్తున్నాయి ప్రతి ఒక్క వార్డులో విపరీతంగా ఉన్నాయి. ఏదైనా పెద్ద ప్రమాదం జరగ ముందే మున్సిపల్ అధికారులు కుక్కల బెడద నుంచి నంద్యాల పట్టణ ప్రజలను కాపాడాలని ఎదురుచూస్తు ఉన్నారు. ఎందుకంటే కుక్కలు ఎక్కువగా పసి పిల్లలపై దాడులు చేసే ప్రమాదం ఉంది నంద్యాల మున్సిపల్ కమిషనర్ నంద్యాల పట్టణ ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్న కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతూన్నరు.

# నిర్మాణరంగ కార్మికులు అందరూ లేబర్ కార్డు తీసుకోండి – మీ భవిష్యత్తును సురక్షితం చేసుకోండి

నంద్యాల, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): స్థానిక నబీ నగర్ నందు ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్షులు మస్తాన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ గురువయ్య, ట్రెజరర్ వెంకట్ ల ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో జరిగిన లేబర్ కార్డు డ్రైవ్ లో ముఖ్యఅతిథులుగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వై. విద్యావతమ్మ, జూనియర్ అసిస్టెంట్ మన్సూర్ లు పాల్గొన్నారు. మస్తాన్ మాట్లాడుతూ ఈ సమావేశంలో స-ుమారు 50 మంది ప్లంబర్ లు పాల్గొన్నారనీ, ఇంతవరకు 350 మంది ప్లంబర్ లు కార్డు తీసుకుని ఉన్నారని, నేటి సమావేశంలో ఇంకొక 20 మంది కార్డులు తీసుకున్నారనీ తెలియజేశారు. వై విద్యాలతమ్మ మాట్లాడుతూ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో 18 నుండి 60 సంవత్సరాలు కలిగిన లబ్ధిదారులు చేరవచ్చుననీ, ఫామ్ నంబర్ 27, 2 ఫోటోలు, ఆధార్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్, నామిని బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, విఆర్ఓ ధ్రువీకరణ పత్రం మరియు సభ్యత్వ రుసుము 50/- రూ-పాయలు, సంవత్సర చందా 12/-, ఐదు సంవత్సరాలకు ఒకసారి 110/-, జీవో నెంబర్ 33 ప్రకారం ఐదు సంవత్సరాలకు ఒకసారి నవీకరణ చేసుకునే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ పథకం ద్వారా లభించే సంక్షేమ పథకాల గురించి మాట్లాడుతూ, కార్మికుని కుమార్తె వివాహ కానుక, కార్మికురాలి/కార్మికుని భార్యకు రెండు కాన్పుల వరకు ప్రసూతి సహాయం 20,000/-, కార్మికుడి సాధారణ మరణం తర్వాత వారి కుటుంబ సభ్యులకు 60,000/- ఆర్థిక సహాయం, దహన సంస్కారాల ఖర్చు 20,000/-, కార్డు కలిగి వుండి ప్రమాదవశాత్తు మరణించిన కార్మికునికి 5,00,000/- అంగవైకల్యం పొందిన కార్మికునికి అంగవైకల్యాన్ని బట్టి గరిష్ట గా 5,00,000/-, కార్మికుల పిల్లలు 9,10,ఇంటర్ చదివే వారికి సంవత్సరానికి 1200/- వృత్తి విద్యా కోర్సులు చదివే వారికి 5000/- ఆర్థిక సహాయం లభిస్తాయని వివరించారు. చొరవ తీసుకొని తమ కార్మికులందరికీ లేబర్ కార్డు లు ఇప్పిస్తున్న ప్లంబర్ అసోసియేషన్ నాయకులను మెచ్చుకున్నారు. భవన నిర్మాణ కార్మికులందరూ ఇలాగే చొరవ తీసుకొని తమ కార్డులు పొంది తమ భవిష్యత్తును పదిలం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి వెంకటేశ్వర్లు, కరీముల్లా, మాబాషా, ఫక్రుద్దీన్, ఫరూక్, జావిద్, సర్దార్, మన్సూర్ బాషా, భూపాల్, రవి, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.




# సనాతన ధర్మదీపికలు రామాయణ, భారత, భగవద్గీతలు

● డాక్టర్ తొగటసురేశ్ బాబు, ధార్మికోపన్యాసకులు

● ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

తుగ్గలి, అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్): లోకాస్సమస్తా-సుఖినోభవంతు అంటూ విశ్వకల్యాణాన్ని కాంక్షించే హిందూ సనాతన ధర్మానికి తరాలు మారినా యుగాలు గడచినా చెదరని దీపికలుగా నిలిచేవి భారత, రామాయణ, భాగవత, భగవద్గీత లేనని వాటి అధ్యయనం, ప్రవచనము నిరంతరం జరగాలని, వాటి ద్వారా వ్యక్తి, కుటుంబ, సామాజిక, దేశ ధర్మాలను తెలుసుకునే వీలు కలుగుతుందని, గోవు సకల దేవతాస్వరూపమని , గోసేవ దేవతాసేవ మాత్రమేకాక దేశసేవ అవుతుందని ధార్మిక ప్రవచకులు డాక్టర్ తొగట సురేశ్ బాబు అన్నారు. తిర-ుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, మారెల్ల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమా-ర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధార్మిక సభా కార్యక్రమంలో మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచకులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ తొగట సురేశ్ బాబు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ సుగుణావతమ్మ, సలహాదారులు యర్రం సుధాకర రెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎ.కోదండరాం, తలారి అంజి, మాజి ఎంపిటిసి ఈడిగ వెంకట రాముడు, భజన మండలి అధ్యక్షులు చాకలి పెద్దయ్య, నక్క శివశంకర్, మంకె.లింగన్న, వై.కౌలుట్ల, పి.రామాంజనేయులు, తలారి లక్ష్మీ నారాయణ, సుధాకర్, ఉపాధ్యాయులు రవీంద్రనాథ్ ఇ.ధృవమూర్తి, యం.పెద్దయ్య, భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



L.K.R COLLEGE OF NURSING
(Affiliated to Dr. N.T.R U.H.S Vijayawada)
Near J.V.R.R. ITI, V.C. Colony, Nandyal - 518502
అడ్మిషన్లు జరుగుచున్నవి
4 సం॥ల B.Sc., నర్సింగ్ కోర్స్,
అర్హత: ఇంటర్ Bi.P.C., మరియు ఒకేషనల్ నర్సింగ్ పాస్ అయిన విద్యార్థినీ, విద్యార్థులు EAPCET అర్హత సాధించిన వారు అర్హులు.
(మేనేజ్మెంట్ కోటా నందు కొన్ని సీట్లు కలవు)
పూర్తి వివరములకు:
85200 10739, 85200 23866
జె.లక్ష్మీకాంత రెడ్డి, చైర్మన్

# మంజు వారియర్.. రియల్ లైఫ్లోనూ వారియరే..

'మనసిలాయో'తో ఒక్కసారిగా సెన్సేషన్ క్రియేట్ చేశారు మలయాళ నటి మంజు వారియర్. నాలుగు పదుల వయసులోనూ హుషారెత్తించేలా ఆమె వేసిన స్టెప్పులు యువతను అమితంగా ఆకట్టుకున్నాయి. త్వరలో 'వేట్టయాన్' విడుదల కానున్న సందర్భంగా ఆమెకు సంబంధించిన పలు ఆసక్తికర విశేషాలు.



మంజు వారియర్

'వేట్టయాన్' మూవీలోని 'మనసిలాయో' పాటతో ఒక్కసారిగా సెన్సేషన్ క్రియేట్ చేశారు మలయాళ నటి మంజు వారియర్. నాలుగు పదులు దాటినా హుషార్రెత్తించేలా ఆమె వేసిన స్టెప్పులు యువతను అమితంగా ఆకట్టుకున్నాయి. నటిగా సెకండ్ ఇన్నింగ్స్లో ప్రేక్షకులను అలరిస్తోన్న మంజు వారియర్.. ఒకానొక సమయంలో వ్యక్తిగత జీవితంలో పలు సమస్యలు ఎదుర్కొన్నారు. కష్టం ఎదురైనప్పుడు తల దించుకుని సాగిపోకుండా.. ధైర్యంగా తన గళాన్ని వినిపించారు. ఆమె నటించిన 'వేట్టయాన్' త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆమెకు సంబంధించిన పలు ఆసక్తికర విశేషాలు.

## రిపబ్లిక్ సినిమా CINEMA

### బుల్లితెర టు వెండితెర..!

తమిళనాడులో నివాసమున్న మలయాళీ దంపతులకు 1978లో మంజు వారియర్ జన్మించారు. చిన్నతనంలో కళలపై ఆసక్తితో కూచిపూడిలో శిక్షణ తీసుకున్నారు. అనుకోని విధంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. దూరదర్శన్లో ప్రసారమైన 'మనోహరం' అనే ధారావాహికతో. తొలిసారి కెమెరా ముందుకు వచ్చారు. 17 ఏళ్లకే నటిగా తెరంగేట్రం చేశారు. 'సాక్ష్యం' (1995)లో కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత ఏడాది వచ్చిన 'సల్లాపం'తో హీరోయిన్గా మారారు.

### నాలుగేళ్లు.. 20 సినిమాలు..!

కెరీర్ పరంగా 'సల్లాపం' తర్వాత ఆమె దశ మారింది. 1995 నుంచి 99 వరకూ సినిమాల్లో యాక్టివ్గా ఉన్నారు. దాదాపు 20 సినిమాల్లో నటించారు. నాలుగేళ్ల వ్యవధిలోనే 'ఈ పూజయుం కాదన్ను' చిత్రానికి ఉత్తమ నటిగా కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డు.. 'కన్నేయితి పొట్టుం తొట్టు'తో జాతీయ అవార్డు.. ఉత్తమ నటిగా నాలుగు ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు.

### జీవితాన్ని మార్చేసిన 'సల్లాపం'..!

1996లో విడుదలైన 'సల్లాపం' మూవీ మంజు కెరీర్నే కాదు.. జీవితాన్నీ మార్చేసింది. ఇందులో హీరోగా నటించిన దిలీప్ తో ఆమె పరిచయం ప్రేమగా మారి 1998లో పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యమిస్తూ సినిమాలకు దూరమయ్యారు. వీరికి ఓ కుమార్తె ఉంది. దాదాపు 16 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2014 వీరు విడాకులు తీసుకున్నారు. నటి కావ్యతో దిలీప్ రిలేషన్లో ఉండటం వల్లే ఆయన నుంచి మంజు విడిపోయారని గతంలో వార్తలు వచ్చాయి. వాటిని నిజం చేస్తూ విడాకుల అనంతరం ఆయన సదరు నటిని రెండో వివాహం చేసుకున్నారు. విడాకుల తర్వాత కుమార్తె కూడా తనతో ఉండేందుకు ఆసక్తి చూపించలేదు. దాంతో మానసికంగా కుంగిపోయిన ఆమె చాలా ఏళ్ల పాటు తెరకు దూరమయ్యారు.

### 'కమ్బ్యాక్' మామూలుగా లేదు..!

భర్తతో మనస్పర్థలు ఏర్పడిన సమయంలో ఆమె మరోసారి కళలపై దృష్టి పెట్టారు. చాలాకాలం విరామం తర్వాత 2012లో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం ఆమె పలు వాణిజ్య ప్రకటనల్లో నటించారు. దాదాపు 15 ఏళ్ల విరామం తర్వాత 'హౌ ఓల్డ్ ఆర్ యూ?' (2014)లో వెండితెరపై మళ్లీ మెరిశారు. తల్లి పాత్రలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అక్కడి నుంచి ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. 'లూసిఫర్', 'విలన్', 'మోహన్లాల్', 'అసురన్', 'తునివు'.. ఇలా ఏడాదికి సుమారు మూడు సినిమాలు చేస్తూ యువ నటీమణులకు పోటీ ఇస్తున్నారు. సెకండ్ ఇన్నింగ్స్ లో మోహన్లాల్, అజిత్, రజనీకాంత్ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో నటించడం తనకెంతో ఆనందంగా ఉందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

### దర్శకుడితో ఇబ్బందులు..!

సెకండ్ ఇన్నింగ్స్ లో ఓ దర్శకుడి వల్ల మంజు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సనల్ కుమార్ డైరక్షన్లో ఆమె 'కయాట్టం' కోసం వర్క్ చేశారు. ప్రేమ పేరుతో ఆ దర్శకుడు వరుస సందేశాలు పంపి ఇబ్బంది పెడుతున్నారంటూ ఆమె 2022లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనకు సపోర్ట్ పలువురు మాట్లాడినప్పటికీ ఆమె మాత్రం వెనక్కి తగ్గలేదు. తన గళాన్ని గట్టిగా వినిపించారు. దీంతో పోలీసులు సనల్ను అరెస్ట్ చేశారు.

### రచయిత, నిర్మాత..!

మంజు వారియర్ మనకు హీరోయిన్గా మాత్రమే తెలుసు. కానీ ఆమె రచయిత కూడా. నటిగా తనకు పేరు తెచ్చిపెట్టిన 'సల్లాపం' పేరుతో ఆమె ఒక పుస్తకాన్ని రచించారు. ఇందులో తన కెరీర్ విశేషాలు పంచుకున్నారు. తాను ఎదుర్కొన్న సవాళ్లు తెలియజేస్తూ యువ నటీనటులకు స్ఫూర్తినిచ్చారు. సినిమాలపై ఆసక్తితో నిర్మాతగా మారారు. గాయనిగానూ టాలెంట్ను బయట పెట్టారు. 'తునివు', 'కాయట్టం' వంటి చిత్రాల్లో పాటలు పాడారు. వివిధ దశల్లో ఎన్నో ఇబ్బందులు ఎదురైనప్పటికీ ధైర్యంగా నిలబడి.. నటిగా జీవితంలో రాణించిన మంజు వారియర్ యువతరంలో స్ఫూర్తినింపుతున్నారు.



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1920: ప్రముఖ హేతువాది, వామపక్షవాది తమ్మారెడ్డి గోపాలకృష్ణమూర్తి జననం (మ.2013).
- 1947: ప్రఖ్యాత జర్మన్ భౌతిక శాస్త్రవేత్త, క్వాంటం భౌతిక శాస్త్రానికి ఆద్యుడు అయిన మాక్స్ ప్లాంక్ మరణం (జ.1858).
- 1957: ప్రపంచపు మొట్టమొదటి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్-1 ని సోవియట్ రష్యా ప్రయోగించింది. (చిత్రంలో)
- 1977: కన్నడ, తెలుగు సినిమా నటి సంఘవి జననం.
- 2004: మాజీ ఒరిస్సా ముఖ్యమంత్రి నీలమణి రౌత్రే కటక్‌లో మరణించాడు (జ.1920).



గోపాలకృష్ణమూర్తి



మాక్స్ ప్లాంక్



కృత్రిమ ఉపగ్రహం



నటి సంఘవి



నీలమణి రౌత్రే

## రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

### మాపై గౌరవం పెరిగింది




ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాపై వరుసగా రెండు టెస్టు సిరీస్లు గెలవడంతో ప్రత్యర్థి జట్టుకు తమపై గౌరవం పెరిగిందని భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అన్నాడు. "ఒకప్పుడు బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో చాలా తీవ్రత కనిపించేది. కానీ మేం వరుసగా రెండుసార్లు ఆస్ట్రేలియాలో సిరీస్ విజయం సాధించడంతో అది మా పట్ల గౌరవంగా మారింది. ఒక టెస్టు జట్టుగా మమ్మల్ని చాలా గౌరవిస్తున్నారు. మేం ఆస్ట్రేలియాతో ఆడుతున్నపుడు అది స్పష్టంగా కనిపిస్తోంది. వాళ్లను సొంతగడ్డపై వరుసగా రెండుసార్లు ఓడించడం వల్లే ఇది సాధ్యమైంది" అని కోహ్లి అన్నాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో కొత్త సిరీస్ నవంబరులో మొదలు కానున్న సంగతి తెలిసిందే.

### టీ 20 ప్రపంచ కప్ బరిలో భారత్ ..
### మూడో స్థానంలో హర్మన్: కోచ్ ముజుందార్

భారత్‌కు గట్టి పోటీనిచ్చే జట్లలో న్యూజిలాండ్ కూడా ఒకటి. మహిళా ప్రపంచకప్లో కివీస్తో తలపడేందుకు టీమ్ ఇండియా సిద్ధమైంది.

మహిళా టీ20 ప్రపంచ కప్లో భారత్ ఇవాళ తన పోరాటం ప్రారంభించనుంది. న్యూజిలాండ్లో తొలి మ్యాచ్లో తలపడనుంది. పొట్టి ఫార్మాట్లో అత్యంత కీలకమైన మూడో స్థానంలో ఎవరు బ్యాటింగ్కు వస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఓపెనర్లుగా షెఫాలీ వర్మ, స్మృతీ మంధాన ఇన్నింగ్స్ను ప్రారంభిస్తారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ వన్డౌన్లో వస్తుందని భారత మహిళా క్రికెట్ జట్టు కోచ్ అమోల్ ముజుందార్ వెల్లడించారు. దుబాయ్ వేదికగా జరగబోయే కివీస్తో మ్యాచ్లోనూ ఆమె ఇదే స్థానంలో ఆడుతుందని తెలిపారు. పొట్టి కప్ ముందు భారత్ ఆడిన విండీస్ సిరీస్లో పెద్దగా రాణించలేదు. రెండు మ్యాచుల్లో కలిపి 11 పరుగులే చేసింది. అయితే, ఇప్పుడు ఈ వరల్డ్ కప్లో ఎలాంటి ప్రభావం చూపించదని కోచ్ స్పష్టంచేశారు. "కేవలం వార్మప్ మ్యాచుల్లోనే కాకుండా.. ట్రైనింగ్ క్యాంప్లోనూ హర్మన్ మూడో స్థానంలో ఆడేలా ప్రాక్టీస్ చేసింది. వరల్డ్ కప్ సన్నద్ధతలో భాగంగా బెంగళూరులో ఏర్పాటుచేసిన క్యాంప్ను ప్రతీ క్రికెటర్ సద్వినియోగం చేసుకున్నారు. ప్రపంచ కప్ ముందు ఆడిన మ్యాచుల గణాంకాలు మాపై ప్రభావం చూపించవు. ఆ పరిస్థితులు వేరు.. ఇప్పుడు టోర్నీ విజేతగా నిలిచేందుకే వచ్చాం. భారత జట్టులోకి కొందరు యువ క్రికెటర్లూ వచ్చారు. మహిళా ప్రీమియర్ లీగ్ వల్లే ఇది సాధ్యమైంది. ఆ లీగ్ లో నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించినవారిని జాతీయ జట్టులోకి తీసుకోవడం జరిగింది. అలాగని దేశవాళీ క్రికెట్ను పక్కన పెట్టలేదు. అక్కడా మంచి ప్రదర్శన చేసేవారున్నారు. దానిని తక్కువగా అంచనా వేయడం లేదు. కానీ, డబ్ల్యూపీఎల్ వల్ల స్ట్రాంగ్ ప్లేయర్లు బయటకొచ్చారు" అని ముజుందార్ తెలిపారు. గ్రూప్-ఎ న్యూజిలాండ్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, శ్రీలంకతో టీమ్ ఇండియా తలపడనుంది. ప్రతీ జట్టూ బలమైందే కాబట్టి ఏ మ్యాచ్నూ తేలికగా తీసుకొనే స్థితిలో భారత్ లేదు. టోర్నీలో శుభారంభం చేయకపోతే సెమీస్ అవకాశాలు సంక్లిష్టమవుతాయి. కనీసం మూడు మ్యాచుల్లో గెలిస్తేనే నాకౌట్ దశకు చేరుకొనే ఛాన్స్ ఉంటుంది.



## అందం

### ఫేస్‌ప్యాక్ రాత్రంతా వేసుకుంటే బెస్ట్ రిజల్ట్స్ ఉంటాయా





**చాలా మంది ఫేస్‌ప్యాక్స్ వాడతారు. అయితే, దీనిని రాత్రంతా అలానే ఉంచితే మంచిదేనా.. తెలుసుకోండి.**

**చాలా ఫేస్‌ప్యాక్స్ ఉంటాయి. ఫేస్‌ప్యాక్స్ అనేవి చర్మ సమస్యల నుంచి బయటపడేందుకు, స్కిన్‌ని క్లీన్ చేయడానికి, హైడ్రేట్ చేయడానికి హెల్ప్ చేస్తాయి. అందులో ఒక్కో ఫేస్‌ప్యాక్ ఒక్కో టైమ్ ఉంచాలి. అయితే, కొంతమంది ఎక్కువసేపు ఉంచితే ఎక్కువ బెనిఫిట్స్ ఉంటాయనుకుంటారు. సాధారణంగా ఫేస్‌ప్యాక్స్‌ని చర్మంపై 15 నిమిషాల నుంచి 30 నిమిషాల వరకూ ఉంచుతారు. మరి అలానే రాత్రంతా ఫేస్‌ప్యాక్స్‌ని అలానే ఉంచడం మంచిదేనా తెలుసుకోండి.**


### ఇంట్లో తయారయ్యే ఫేస్‌ప్యాక్..

చాలామంది ఇంట్లోని పదార్థాలతో ఫేస్‌ప్యాక్స్, మాస్క్‌లని వాడతారు. కానీ, బెస్ట్ రిజల్ట్స్ కోసం ఎక్కువసేపు ఉంచాలనుకుంటారు. కానీ, అలా ఉంచడం మంచిది కాదు. కాసేపు



### రాత్రంతా ఉంచితే..

రాత్రంతా ఫేస్‌ప్యాక్ నిద్రపోతే చర్మ సమస్యలు వస్తాయి. వీటిని ఎక్కువసేపు ఉంచితే లాభాల కంటే నష్టాలొసాయి. స్కిన్ మొత్తం డీహైడ్రేట్ అవుతుంది. స్కిన్ రఫ్‌గా కనిపిస్తుంది. కాబట్టి, అలా చేయొద్దు. కొన్ని ఫేస్‌ప్యాక్స్ 15 నిమిషాల్లోనే డ్రై అవుతాయి. ఇలాంటి ప్యాక్స్ రాత్రంతా ఉంచితే తేమ కోల్పోయి మరింత పొడిబారతుంది.



### స్కిన్ ప్రాబ్లమ్స్..




సాధారణంగా రాత్రి సమయంలో ఫేస్‌ప్యాక్ వేయడం వల్ల చర్మసమస్యలు దూరమవుతాయి. ఈ సమయంలో మందంగా ఫేస్‌ప్యాక్ వేస్తే రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు ఏర్పడతాయి.

### మరకలు..

అదే విధంగా, ఫేస్‌ప్యాక్ వేసుకుని పడుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. దీంతో పాటు దుప్పట్లు, బెడ్‌షీట్, పిల్లో కవర్స్ పడతాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రంతా ఫేస్‌ప్యాక్ వేసుకోవద్దని గుర్తుపెట్టుకోండి.



### నైట్ మొత్తం వేసుకోవాలంటే..



అయితే, మనం తయారుచేసే ఫేస్‌ప్యాక్స్ బదులు..ఓవర్‌నైట్ ఫేస్‌మాస్క్‌లు ఉన్నాయి. వీటిని రాయడం వల్ల చర్మంలోని తేమని కోల్పోకుండా ఎక్కువసేపు ఉంచేలా ఉంటాయి. దీంతో వీటిని చక్కగా ఓవర్‌నైట్ వాడొచ్చు.

### అదే విధంగా..



ఇదే కాకుండా, ఓవర్‌నైట్ మాస్క్ బదులు సీరమ్స్, నైట్ క్రీమ్‌ని కూడా వాడొచ్చు. ఇవి మీ స్కిన్‌కి సెట్ అయ్యేవి చెక్ చేసుకోండి.

గమనిక: నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

